# సైకాలజిస్టు శంకరం

విపరీతమైన ఉత్సాహం కన్పిస్తోంది ఎటు చూసినా. రోడ్డుకు రెండు వంకలా చూస్తూ నెమ్మదిగా నడుస్తున్నాడు శంకరం. శంకరం మఠందగ్గర చాలా రద్దీగా గడబిడగా వుంది. కనిపించని దేముడి కోసం, శరీరాల్నీ మనసుల్నీ పట్టి వ్రేలాడుతున్న పాపాల్ని దులుపుకోవడంకోసం మనుషులక్కడ పోగవుతున్నారు.

చుట్టూ ఉన్న చైతన్యం చూస్తుంటే శంకరంలో కూడా ఉత్సాహం ఉప్పెనలా ఎగసింది. వెంటనే ఏదో చెయ్యాలి. కాని శంకరంలాంటి సామాన్యుడు అనుకున్న వెంటనే ఏం చెయ్యగలగుతాడు. విమానం ఎక్కి గాలిలో ఎగరలేదు. కారులో కూర్చుని చక్రం తిప్పలేదు. క్రొత్తదనంకోసం రిక్షా ఎక్కి త్రొక్కనూ లేదు. ధనికుడూ కాలేదు. దరిద్రుడూ కాలేడు. మధ్యస్థమైన భావుకత్వపు వ్యక్తిత్వంలో బ్రతకవలసినవాడు మరి.

నెమ్మదిగా శంకర మఠం లోపలికి దారి తీశాడు. కాలికేదో తాడు పేనుకున్నట్లనిపించి క్రిందకు చూస్తే ముష్టివాడిలాంటివాడొకడు కాళ్ళు పట్టుకున్నాడు 'చెప్పు లిక్కడియ్యండి సార్. ఐదు పైసలు' అన్నాడు వాడు. 'నా దగ్గర నాలుగు పైసలే సార్' అన్నాడు వాడి ప్రక్కనున్న మరొకడు. ఇద్దరి దగ్గర చెరో చెప్పూ పడేసి, ఇద్దరికీ చెరో మూడు పైసలూ యిచ్చి నవ్వులాంటి మూల్గు వాళ్ళ ముఖాన పడేసి తెల్లబోయిన వాళ్ళు నల్లబడకముందే లోపలకు వెళ్ళాడు శంకరం.

అర్డెడు పక్షే గిన్నెలో కుంచెడు బోసినట్లు కిటకిటలాడుతోంది లోపలంతా. పరికిణీలవాళ్ళూ, చీరలవాళ్ళు, పంచెలవాళ్ళూ గొట్టాం పంట్లాలవాళ్ళూ అందరూ భుజాలు పూసుకుంటూ లోపల సందడిగా తిరుగుతున్నారు. ఎవరి మనసుకు నచ్చిన పనులు వాళ్ళు చేస్తున్నారు.

ఊహిస్తూ తర్కిస్తూ కాలంగడపాలంటే సరదాపడే రకం శంకరం.

'ఇంతమంది జనం యిక్కడ యిలా కూడారుకదా, వీళ్ళందరూ ఈ క్షణాన ఏం ఆలోచిస్తుంటారు.' శంకరం ఆలోచన లిప్తకో విధంగా విరుగుతోంది.

మనుషులందర్నీ పోగు బోసి చూస్తున్న దృష్టి నెమ్మదిగా వెళ్ళి ఎవరో మధ్యవయసావిడ ప్రక్కన కూర్చున్న కుర్రవాడిమీద నిలిచింది. పదేళ్ళుంటాయేమో. బొద్దుగా

సామాన్యమైన ఎత్తులో వున్నాడు కుర్రాడు. రుచులకోసం వాపోతున్న వాడి చేతికి, జీడిపప్పు పకోడీ అందినట్లయింది శంకరానికి.

ఆ కుర్రాడు తన వంక చూస్తే పిలుద్దామనుకున్నాడు. పిలిచి... వాడి మనసుకు ప్రపంచం అంటే ఏం అనిపిస్తుంటుందో ప్రశ్నించి తెలుసుకోవాలనిపించింది సైకాలజీలో బి. యే. చదివిన శంకరానికి.

కుర్రాడు చూడనే చూశాడు శంకరం కేసి యాదృచ్ఛికంగా. శంకరం సూచన గ్రహించి ముందు తటపటాయించినా కదిలివచ్చాడు మొత్తానికి. ఆ కుర్రాడి భుజంమీద చేతులువేశాడు శంకరం. కొండ మీదపడ్డట్టు ముడుచుకున్నాడు వాడు.

... ... ... ... ?

ఆవిడ మా అమ్మ. ప్రక్కన కూర్చుంది మా అక్కయ్య, మధ్య వయసావిడ ఎడంవేపు అందం పోగుపోసినట్లు సొగసుగా పదహారేళ్ళ వయసు కూర్చుని వుంది. కళ్ళు విప్పార్చి చూశాడు రెండు క్షణాల పాటు శంకరం.

"నువ్విక్క డెందుకున్నావ్ ?"

"పురాణం విందామని..." వాడి గొంతులో వణుకు వినబడింది.

"ఆయనెవరో తెలుసా నీకు ?" శంకరం వేలు హరిదాసును సూచించింది.

"దేముడట. మా అమ్మ చెప్పింది" ఈసారి మరీ పీలగా వినిపించింది వాడి గొంతు. వాడు భయపడుతున్న సంగతి గుర్తించలేదు శంకరం. అదే ధోరణిలో తన ప్రయోగం సాగిస్తున్నాడు.

"నిజంగా నువ్వు దేముడ్ని చూద్దామని వచ్చావా ? ప్రసాదం కోసం కాదూ..."

ఆ పిల్లాడు జవాబు చెప్పలేదు. మొహం అంతా ఎర్రబడిపోయింది. కళ్ళు భయంగా, రాక్షసుడికి చిక్కిన వాడిలా చూస్తున్నాయి. కాళ్ళు వణుకుతున్నాయేమో కూడా. వాడి మనసులో ఏం తిరుగుతోందో కానీ పెదిమలు దడదడ లాడుతున్నాయి. భయపెట్టడానికి వాళ్ళమ్మ చెప్పిన కథలో రాక్షసుడిలాగే కన్పిస్తున్నట్లున్నాడు శంకరం.



ద్వితీయ బహుమతి [రూ. 25]
శ్రీమతి వి. యస్. భారతీమూర్తి
(బి. యస్ సి [ఫైనల్]. ఓ. యు. సైన్సు కాలేజీ, హైదరాబాదు.)

సంగతి అప్పటికిగానీ తెలిలేదు శంకరానికి. ప్రశ్న మీరుద్దామని నోరు విప్పబోయేంతలో భుజం మీది చేతులు గట్టిగా విదిలించుకుని బోను తెగ్గొట్టుకు బయటపడిన ఎలక లాగా పారిపోయాడు వాడు.

తల్లి దగ్గరకువెళ్ళి ఏం చెప్పాడో అవిడ రెండు మూడుసార్లు తిరిగి తిరిగి శంకరంవంక చూసింది.

మళ్ళీవస్తే వాడిని పట్టుకుని భయంలేదని సముదాయిద్దా మను కుని నిలబడ్డాడు శంకరం. ఎంత సేపు నిలబడ్డా వాడు మళ్ళీ అటు తిరగలేదు. తల్లి వెనక నక్కి కూర్చున్నాడు. పురాణం అయి పోయాక వెతుకుతే వాళ్ళ జాడ దొరకలేదు శంకరానికి.

• • •

"కొంప వీధిన పడేద్దామనేరా నీ ఉద్దేశం? అవతల వీధిలో శేషమ్మగారని ఉందటో కావిడ, నిన్న సాయంత్రం శంకరమఠంలో వాళ్ళ బ్బాయి నేదో బెదిరించావట. హడిలి పోయి రాత్రంతా ఒకటే జ్వరం పలవరింతలూనట. వాళ్ళ పిల్లనేదో అన్నావుట. మీ వాడిని శాస్త అదుపులో ఉంచండమ్మా అని ఈరోజు ప్రొద్దున్న అవిడొచ్చి పెద్ద గలాటా చేసి వెళ్ళింది. ఇదేం బాగుందిచెప్పు."

శంకరం ప్రాన్పడిపోయాడు ఈ పరిణామం చూసి.

అంతకంటే ఆశ్చర్యం ముందు ఎదురైంది శంకరానికి.

"రేవు శేషమ్మగారి పిల్లను చూడ్డానికి వెళ్తున్నాం సిద్ధంగా వుండు."

"ఇవుడే పెళ్ళేమిటి నాన్న గారూ..."

"ఇంట్లో జాగ్రత్తగా పడివుంటా వని" అంత కఠినంగా మాట్లాడు తున్న తండ్రికి ఏం చెప్పినా విన దన్నది శంకరానికి తెలుసు.

• • •

అత్తవారింట్లో బాదం చెట్టు క్రింద బావమరిదిని బుజ్జగించి బిస్కట్లు పెట్టి బెల్లించాడు శంకరం.

"జుట్టు నుదురుమీద పడేవాళ్లూ గొట్టాంలాగూ తొడుక్కునేవాళ్ళూ మంచివాళ్ళు కాదుట బావా. అడ పిల్లల్ని అంటే అక్కయ్యలాంటి వాళ్ళనిఏడిపిస్తారుట.పిల్లలచేతకబుర్లు చేస్తారుట. అక్కయ్య నాకోసారి చెప్పిందిలే..." దూరంగా వస్తున్న శకుంతలని చూసి ప్రక్కనుంచి జారి పోయాడు కుమ్మ-డు, శంకరం బావమరిది.

వాడిపీక నలుపుదా మనిపించింది శంకరానికి. అల్లరిగా నవ్వుతున్న శకుంతలమెడన్నా నలపాలను కున్నాడు.

అతని నుదురుమీద పడుతున్న జుట్టుతో అడుతున్న శకుంతల మెడ ఎలా నలపాలో తోచక ఉక్కిరి బిక్కిరైపోయాడు - మల్లె పూలు తొడుక్కొచ్చిన రాత్రిలో శంకరం. పాపం సైకాలజిస్టు శంకరం.

□□□